

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్ర ప్రసాద్ పిలుపు నిచ్చారు. 8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
32.4°/17.7°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10న తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(07065) నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 5.30 గంటలకు తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూల్ సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్, మహబుబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, కాచిగూడ మీదుగా సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.15 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు వెళ్తున్న విద్యార్థులతో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: మండలంలోని చెగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి పంజాబ్ రాష్ట్రం లూధియానాలో జరిగే జూడో పోటీల్లో చిగిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యశస్విని, శ్రీనిత్య పాల్గొననున్నట్లు పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో చిగిచెర్లలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో విద్యార్థులిద్దరూ అత్యంత ప్రతిభ కనబరచారన్నారు. 48 కేజీల్లోపు విభాగంలో శ్రీనిత్య, 52 కేజీల్లోపు విభాగంలో యశస్విని బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. అనంతరం జాతీయ స్థాయి టోర్నీకి వెళ్తున్న విద్యార్థులు శ్రీనిత్య, యశస్వినిలను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎర్ర చందనం స్వాధీనం

అనంతపురం క్రైం: విలువైన ఎర్ర చందనాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, 40 కిలోల దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ సమీపంలోని కురుమాల గ్రామానికి చెందిన రాము, చెన్నకేశవ కొన్ని రోజుల క్రితం గాండ్లపెంట సమీపంలోని ముదిరెడ్డిపల్లి వద్ద ఎర్రచందనం చెట్టును కొట్టి దుంగలను తీసుకెళ్లి ఇంట్లో దాచారు. ఈ క్రమంలో ఆ దుంగలను అనంతపురంలోని ఓ టింబర్ డిపోలో అమ్మవచ్చునని ఎవరో తెలపడంతో నమ్మి శుక్రవారం ఉదయం అనంతపురానికి చేరుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

స్నాతకోత్సవానికి వేళాయె

- నేడు జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్
- గౌరవ డాక్టరేట్‌కు ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డి ఎంపిక
- 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీలు



స్నాతకోత్సవానికి ముస్తాబైన జేఎన్‌టీయూ(ఏ) ఆడిటోరియం

అనంతపురం : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూఏ) 13 స్నాతకోత్సవం శనివారం జరగనుంది. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీల చాన్సలర్ /గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేస్తున్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ వి.సత్యనారాయణరాజు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు కానున్నారు. గౌరవ డాక్టరేట్‌ను ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డికి అందజేయనున్నారు. మొత్తం 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీలు, 70 బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు. అత్యధికంగా బంగారు పతకాలు సాధించిన వారిలో విద్యార్థినులు ఉండడం విశేషం.

- జేఎన్‌టీయూ(ఏ) స్నాతకోత్సవ సన్నాహక కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి.సుమలత, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భారత్ వికసిత్ సంకల్పయాత్రకు గవర్నర్

గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర గౌతమి అధికారులను ఆదేశించారు. శనివారం జేఎన్‌టీయూ స్నాతకోత్సవం ముగిసిన తర్వాత గవర్నర్ బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం గవర్నర్ పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, స్వమిత్వ, సెంట్రల్ వర్సిటీ తదితర అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఒక ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 250 మంది పోలీసులు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ ప్రొటోకాల్ స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వర్, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ గ్రంధి వెంకటేశ్, డీపీఓ ప్రభాకర్ రావు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, డీఈఓ నాగరాజు, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి, హార్టికల్చర్ పీడీ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, సీఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ సన్నాహ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, ఆడిటోరియంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న వీసీ



బుక్కరాయసముద్రంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమి

కనగానపల్లి ఎస్ఐకి రిమాండ్



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటాద్రి

కనగానపల్లి: ఓ కేసులో నిందితుడి నుంచి లంచం తీసుకునేందుకు ప్రయత్నిస్తూ ఏసీబీ అధికారులకు చిక్కిన కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి శుక్రవారం చెన్నేకొత్తపల్లిలో విలేకరులకు తెలిపారు. ఓ కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తిని కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డి, రామగిరి సీఐ చిన్నగౌస్ డబ్బులు డిమాండ్ చేశారు. పోలీసులు అడిగిన మొత్తం ఇస్తానని ఒప్పుకున్న అతను అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు డబ్బులిచ్చేందుకు చెన్నేకొత్తపల్లి స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న సీఐ చిన్నగౌస్, ఎస్ఐ హనుమంతరెడ్డి ఉన్నారు. అయితే డబ్బులిచ్చేందుకు వెళ్లిన వ్యక్తి పోలీసు స్టేషన్‌లోకి వెళ్లగానే సీఐ చిన్నగౌస్ స్టేషన్ బయటకు వచ్చాడు. అదే సమయంలో అక్కడే ఉన్న ఏసీబీ అధికారుల కారును చూసి పరారయ్యాడు. దీంతో ఏసీబీ అధికారులు ఎస్ఐ హనుమంతరెడ్డిని అదుపులోనికి తీసుకుని విచారించారు. లభించిన ఆధారాలు, సాక్ష్యాలు మేరకు శుక్రవారం అరెస్టు చేసి కర్నూలులోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రిమాండ్ విధించారు. ఈకేసులో మరో సూత్రదారుడిగా ఉండి, దాడి సమయంలో పారిపోయిన సీఐ చిన్నగౌస్‌పై కూడా ఆరా తీస్తున్నామని ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

8 నుంచి 'పురం'లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

హిందూపురం అర్బన్: వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 8న హిందూపురం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక తెలిపారు. 8న ఉదయం హిందూపురం మండలం చౌళూరు, తూమకుంట, గోళ్లాపురం, సంతేబిదనూరుల్లో పర్యటిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కొటిపి, కిరికెర, బేవనహళ్లిలో పర్యటించి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని పేర్కొన్నారు. 9న ఉదయం పూలకుంట, కగ్గల్లు, మనేసముద్రంలో పర్యటిస్తారని చెప్పారు. మధ్యాహ్నం మలగూరు, ఎం.బీరేపల్లి, చలివెందుల, బాలంపల్లిలో పర్యటిస్తారని వివరించారు. మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు.

అర్హులందరికీ న్యాయం

- నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు
- మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలో 2,617 మందికి రూ.4.155 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు ద్వైవార్షిక నగదు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా జగన్ సర్కార్ ముందుకు సాగుతోంది. అర్హత ఉన్నా.. ఏ కారణం వల్లనైనా సంక్షేమ పథకాలు అందని వారికి మరో అవకాశం కల్పిస్తోంది. చిన్న చిన్న కారణాలతో ప్రభుత్వ పథకాలు పొందలేని వారిని గుర్తించి ఏడాదికి రెండు సార్లు ఆర్థిక సాయం అందిస్తూ అర్హులందరికీ న్యాయం చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 'ద్వైవార్షిక నగదు మంజూరు' కింద వివిధ పథకాల సంబంధించిన మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ /వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు పాల్గొని సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ద్వైవార్షిక నగదుకు సంబంధించిన చెక్కు పంపిణీ అనంతరం ఆయన మాట్లాడారు. ఏదైనా కారణం చేత ఆర్థిక సహాయం అందని లబ్ధిదారులను గుర్తించి మరీ పథకాలను అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరులో భాగంగా జిల్లాలో 'జగనన్న అమ్మ ఒడి' పథకం కింద 1,683 మందికి రూ.2.391 కోట్లు, 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం కింద 127 మందికి రూ.30 లక్షలు, ఈబీసీ నేస్తం కింద 153 మందికి రూ.23 లక్షలు, జగనన్న చేదోడు పథకం ద్వారా 460 మందికి రూ.46 లక్షలు, వైఎస్సార్ కల్యాణమస్తు/ వైఎస్సార్ షాదీ తోఫా కింద 90 మందికి రూ.64.7 లక్షలు, వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 38 మందికి రూ.5.70 లక్షలు, వైఎస్సార్ వాహన మిత్ర కింద 66 మందికి రూ.6.6 లక్షలు మంజూరైందన్నారు. మొత్తంగా జిల్లాలోని 2,617 మందికి రూ.4.155 కోట్లు లబ్ధి కలిగిందన్నారు.

గతమంతా ఎగ్గొట్టడమే

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిందే రెండు మూడు పథకాలనీ, అవీ అరకొరగానే ఇచ్చారని 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి అన్నారు. అందుకే తెలుగు తమ్ముళ్లు సైతం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మెచ్చుకుంటున్నారన్నారు. గతంలో వారంతా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చి పథకాలు అందుకునే వారన్నారు. కానీ జగన్ సీఎం అయ్యాక కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలను అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. అందువల్లే అందరూ ఇప్పుడు జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని, ప్రజా మద్దతుతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోని 175 స్థానాల్లో గెలుపొంది చరిత్ర సృష్టిస్తుందన్నారు.

పిలిచి మరీ 'చేదోడు' ఇచ్చారు



గత ఏడాది వేలిముద్రలు వేయక పోవడంతో 'జగనన్న చేదోడు' అందలేదు. దీంతో వలంటీర్‌కు చెప్పాగా ఇంటికే వచ్చి వేలి ముద్రలు తీసుకెళ్లాడు. నేడు పిలిచి మరీ చేదోడు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. ప్రతి పథకమూ వలంటీర్, సచివాలయ ఉద్యోగి ద్వారా అందాయి. – శ్రీనివాసులు, నాయీబ్రాహ్మణుడు, పుట్టపర్తి

నేతన్న నేస్తం అందింది



విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందన్న కారణంతో నాకు 'నేతన్న నేస్తం' పథకం అందలేదు. దీంతో సచివాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశా. సమస్య పరిష్కరించడంతో పాటు పథకంలో భాగంగా 'నేతన్న నేస్తం' కింద అందించే రూ.24 వేలు నా ఖాతాలో జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. – సుధాకరరెడ్డి, ధర్మవరం

ముఖ్యమంత్రికి ఫ్యాన్ అయ్యా



నేను 25 ఏళ్ల క్రితం కోల్‌కతా నుంచి పుట్టపర్తికి వచ్చి స్థిరపడ్డాను. దంపతులిద్దరమూ సత్య సాయి సంస్థల్లో సేవ చేస్తున్నాం. ఇక్కడ ప్రభుత్వ పథకాలు చాలా బాగున్నాయి. ఇటీవలే పింఛన్ కోసం దరఖాస్తు చేశా. ధ్రువీకరణ పత్రాలన్నీ పరిశీలించి పింఛన్ మంజూరు చేశారు. వలంటీర్ వచ్చి పింఛన్ మంజూరైందని చెబితే ఇక్కడికి వచ్చా. ముఖ్యమంత్రి ప్రసంగం విని ఆయనకు ఫ్యాన్ అయ్యా. – లక్ష్మీరాయ్, సత్యసాయి భక్తురాలు, పుట్టపర్తి

'సురక్ష'తో పేదలకు మెరుగైన వైద్యం

- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి మండలం పెడపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడి సౌకర్యాలు, వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు ఇచ్చిన కేస్ షీట్, మందులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... సురక్ష శిబిరాల్లో గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఇటీవల ఎక్కువగా రక్తహీనత కేసులు నమోదవుతున్నాయని, ముఖ్యంగా చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వైద్యుల సూచనలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడారు. సురక్ష శిబిరాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శుభదాస్, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సర్పంచ్ మంగ్లీబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నివేదిత, వైద్యాధికారులు లిఖిత, డాక్టర్ అభినయరెడ్డి, కలీమున్నీసా బేగం, జగదీష్, ఎంపీడీఓ నాగేశ్వర రెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రోగికి కేస్‌షీట్‌ను అందిస్తున్న అధికారులు

సంబరమని పింఛన్

- పండుగ వాతావరణంలో పింఛన్ పెంపు ఉత్సవాలు
- లబ్ధిదారులకు 'కానుక' అందజేసిన ప్రజాప్రతినిధులు
- గ్రామగ్రామాన సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

పుట్టపర్తి అర్బన్: ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ పెంపు ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గ్రామ సభలు ఏర్పాటు చేసి పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. వారితో కలిసి భోజనం చేసి సంతోషంలో పాలుపంచుకున్నారు. ఫలితంగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో జోరుగా సాగుతోంది. జిల్లాలోని 2,75,844 మందికి ప్రభుత్వం రూ.82.37 కోట్లు మంజూరు చేయగా, ఇందులో 3,309 నూతన పింఛన్లు ఉన్నాయి.

- పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మార్కెట్ యార్డులో శుక్రవారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వేలాది మంది లబ్ధిదారులకు పెంచిన పింఛన్ మొత్తాన్ని అందజేయగానే, ఆ ప్రాంతమంతా 'జయహో జగన్' నినాదాలు మిన్నంటాయి. అనంతరం ఎమ్మెల్యే బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో నూతన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
- కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న వైఎస్ జగన్‌ను అందరం కలిసి మరోసారి సీఎంను చేసుకుందామన్నారు.
- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి వద్ద లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. దీంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు.
- హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక లబ్ధిదారులకు పింఛన్ మొత్తం పంపిణీ చేశారు. వేలాది మంది లబ్ధిదారులు పాల్గొనగా, పండుగ వాతావరణం నెలకొంది.
- మడకశిర నియోజకవర్గం రొళ్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన పింఛన్ పెంపు ఉత్సవాల్లో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన పింఛన్ పెంపు ఉత్సవాల్లో పింఛన్ మొత్తం అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లిలో పింఛన్ మొత్తాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



కదిరి మున్సిపాలిటీ కుమ్మరవాండ్లపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



హిందూపురంలో పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్న సమన్వయకర్త దీపిక

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్

పుట్టపర్తి అర్బన్: బాలల రక్షణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, సభ్యురాలు కామేశ్వరి విచ్చేశారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో తొలిసారి బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నాని, రానున్న రోజుల్లో కలెక్టర్, ఎస్పీల నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్య సదుపాయాలతో పాటు వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన విద్యార్థులకు జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విద్యాకానుక తదితర పథకాలు అమలు చేయడంతో పాటు నాడు- నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లోని సిబ్బంది బాలలతో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. బాలల హెల్ప్ లైన్ నంబర్ 1098ను అన్ని సంక్షేమ హాస్టళ్లలో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు, సలహాల కోసం ప్రత్యేకంగా బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు బాలలకు జీవించే హక్కు, భాగస్వామ్యపు హక్కు, రక్షణ హక్కులను పరిరక్షించాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. ఇంకా ఎక్కడైనా బాల కార్మికులు ఉంటే వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బాలల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, సంరక్షణ సమితి అధికారులు మురళీ, నాగమల్లేశ్వరరెడ్డి, నాగలక్ష్మి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్లు కృష్ణమాచారి, శిశు గృహ మేనేజర్ సునీత, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు, కేజీబీవీ అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్



పాల్గొన్న ఎంఈఓలు, ప్రిన్సిపాళ్లు, అధికారులు

క్లుప్తంగా

డీజిల్ ట్యాంకర్ స్వాధీనం



పోలీస్ స్టేషన్ వద్ద నిలిపిన ఎస్ఆర్‌సీ డీజిల్ ట్యాంకర్

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై థామస్ మన్రో తోపు సమీపంలో గురువారం అర్ధరాత్రి నుంచి బెంగళూరు నుంచి అనంతపురానికి డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ.. బెంగళూరు నుంచి అనంతపురానికి 14 వేల లీటర్ల డీజిల్ తరలిస్తున్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నది వాస్తవమన్నారు. అయితే ఇండియన్ ఆయిల్ కంపెనీ నుంచి ప్రత్యేక అనుమతి పొంది డీజిల్ తరలిస్తున్నట్లుగా విచారణలో నిర్ధారణ అయిందన్నారు. అంతేకాక ఇతర బిల్లులూ సక్రమంగా ఉన్నాయని, కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు సమాచారం ఇచ్చి వారి సూచన మేరకు వాహనాన్ని రిలీజ్ చేసినట్లు వివరించారు.

27 మందికి కోవిడ్ పరీక్షలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం కోవిడ్ లక్షణాలు కలిగిన 27 మందికి ఆర్‌టీపీసీ పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల్లో ఎవరికీ కోవిడ్ నిర్ధారణ కాలేదని పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు ఆనంద్

బత్తలపల్లి: మండల కేంద్రం సమీపంలో ఓ వ్యక్తి ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... తాడిమర్రిలోని కునుకుంట్ల రోడ్డు మార్గంలో నివాసముంటున్న దాసరి ఆనంద్ (40)కు భార్య ఓబులమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సొంతంగా బొలెరో వాహనం పెట్టుకుని బాడుగకు తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో బత్తలపల్లి మండలం అగ్రహారంలోని ఓ రైతుకు చెందిన టమాట పంటను మదనపల్లి మార్కెట్‌కు తరలించి, తిరుగు ప్రయాణంలో శుక్రవారం వేకువజాము 1 గంటకు బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నాడు. వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి కిందకు దిగిన ఆయన... కొంతదూరం నడుకుంటూ వెళ్లి ఉన్నఫళంగా బొక్కబోర్లపడ్డాడు. తెల్లవారుజామున బత్తలపల్లిలోని సమీప బంధువు అటుగా వెళుతూ చూసి విగతజీవిగా పడి ఉన్న ఆనంద్‌ను చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది సైతం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. దీంతో ఆనంద్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భార్య ఓబులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, టమాట తరలింపులకు సంబంధించి ఇచ్చిన బాడుగ డబ్బులు మృతుడి వద్ద లేవు. రాత్రి మొదలు తెల్లవారుజాము 4 గంటల వరకూ హిజ్రాలు ఆ ప్రాంతంలో ఉంటారని, వారే ఆనంద్‌ను ఏమైనా చూసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

వృద్ధుడి దుర్మరణం

లేపాక్షి: కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... లేపాక్షి మండలం బిసలమానేపల్లి పంచాయతీ రాజీవ్ కాలనీకి చెందిన శ్రీరామప్ప (70) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బిసలమానేపల్లి నుంచి కాలనీ వైపుగా రోడ్డు మీద పాకుతూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు కుమార్తె, కోడలు, మనవడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.





వివాహిత బలవన్మరణం



మృతురాలు సౌభాగ్య

గుంతకల్లు రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం వైటీచెరువు గ్రామానికి చెందిన కొండన్న, సౌభాగ్య (40) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు ఎకరాల పొలంలో వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా సౌభాగ్య ప్రవర్తనలో విపరీతమైన మార్పు వచ్చింది. అమ్మవారు అవహిస్తోందని కొందరు... గాలి చేష్టలంటూ మరికొందరు అనడంతో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇటీవల అర్ధరాత్రి నిద్రలేచి చుట్టుపక్కల ఇళ్లలోకి వెళ్లడం చేస్తోంది. దీంతో విసిగిపోయిన కొండన్న మద్యానికి బానిసై తరచూ ఆమె ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంట్లోనే ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంటికి చేరుకున్న కొండన్న వెంటనే తన భార్యను పట్టుకుని కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని రప్పించుకుని ఆమెను కిందకు దించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విధుల్లోకి కేజీబీవీ సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: సమస్యలపై సమ్మె బాట పెట్టిన కేజీబీవీ సిబ్బంది విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 161 మంది సీఆర్టీలు సమ్మెలోకి వెళ్లిన విషయం తెలిసిందే. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని, ఉద్యోగులందరికీ న్యాయం చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపినా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమ్మెలోకి వెళ్లిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గడువు ముగుస్తుండడంతో నోటీసులకు అందరూ సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం విధుల్లోకి చేరుతామని సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావును కోరారు. ఆయన అంగీకరించడంతో 161 మంది గురువారం విధుల్లో చేరారు. కాగా, సమ్మెలో ఉన్న ఎమ్మార్సీ సిబ్బందికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. నోటీసులు అందుకున్న వారిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



మృతి చెందిన ఇహాన్యశ్రీ

తాడిపత్రి అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వెంకటరమణ, నాగజ్యోతి దంపతుల కుమార్తె ఇహాన్యశ్రీ (5) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. శుక్రవారం ఉదయం కుమార్తెను స్నానం చేయించేందుకు బాత్‌రూం వద్దకు తల్లి తీసుకెళ్లింది. బకెట్‌లోని వాటర్‌హీటర్‌ను తల్లి ఆఫ్ చేసే లోపు బాలిక చేత్తో ముట్టుకోవడంతో షాక్ గురైంది. ఆ సమయంలో కుమార్తెను కాపాడుకునేందుకు తల్లి అప్రయత్నంగా తాకడంతో ఆమెకూ స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన వెంకటరమణ వెంటనే ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలియగానే కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం అండర్-12 విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ లీగ్ పోటీలను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లాతో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే బాస్కెట్‌బాల్ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆర్డీటీ, ఈగల్ క్లబ్ సహకారంతో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రొటేషన్ పద్ధతిలో ఈ లీగ్ పోటీలు త్వరలో అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, నరేంద్ర పాల్గొన్నారు.

జనవాక్కు

మనసున్న మారాజు



నా భర్త ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నా. ఇంటి పెద్దను కోల్పోయిన తర్వాత కుటుంబ పోషణ చాలా భారమైంది. ఇలాంటి పరిస్థితుల్లో నాకు వితంతు పింఛన్‌ను జగన్ ప్రభుత్వం మంజూరు చేసి ఆదుకుంది. ఈ నెల నుంచి పింఛన్‌ను రూ.3వేలు చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. సీఎం వైఎస్ జగన్ నిజంగా మనసున్న మారాజు. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నా.

– ఈడిగ నాగమ్మ, గుడిబండ

పేదలకు మంచే జరిగింది



జగన్ ప్రభుత్వంలో పేదలందరికీ మంచే జరిగింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా పేదల గురించి ఆలోచించింది లేదు. కూలి పనులు చేసుకుని బతుకుతున్న నాకు.. ఎలాంటి మధ్యవర్తుల సిఫారసు లేకుండా రూ.3 వేల పింఛన్ మంజూరైంది. గతంలో ఏదైనా సర్టిఫికెట్లు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి అగచాట్లు పడేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. మా ఊళ్లోనే సచివాలయంలో అన్ని రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. పేదలు మరింత మంచి జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే కావాలి.

– మారెక్క, పాలవాయి, కళ్యాణదుర్గం మండలం

జగనే మళ్లీ సీఎం కావాలి



నాకు భర్త గాని, కుమారులు... కుమార్తెలు గాని లేరు. ఎవరూ దిక్కులేరు. 20 ఏళ్లుగా కళ్లు కనిపించక చాలా ఇబ్బంది పడ్డాను. గ్రామంలో ఇళ్ల వద్ద భజనలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు ఇంకొకరి సాయంతో వెళ్లి గంటల తరబడి వేచి ఉండేవాళ్లం. అధికారుల ఆ రోజు రాకపోతే మరుసటి రోజు వెళ్లి వారు ఇచ్చేంత వరకూ వేచి ఉండి తీసుకుని వచ్చేవాళ్లం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చి వెళుతున్నాడు. అంతేకాక పింఛన్ కూడా రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచారు. ఎంతో ఆనందంగా ఉంది. మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నా.

– బసమ్మ, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

ఆదుకున్నారు



కొత్త పింఛన్ మంజూరైందని నన్ను ఈ రోజు ఎంపీడీఓ ఆఫీసుకు పిలిపించారు. చాలా సంవత్సరాలుగా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా. గత ప్రభుత్వం అయితే పూర్తిగా పట్టించుకోలేదు. అప్పట్లో పింఛన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే మరొకరికి ఆ పింఛన్ ఇస్తామనేవాళ్లు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత ఒకరి చావు కోరుకోకుండా, ఎవరి సిఫారసు లేకుండా పింఛన్ అందజేస్తున్నారు. ఇది అందరూ సంతోషించాల్సిన విషయం. మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నా.

– జైతూన్‌బీ, యల్లనూరు

ఐపీ వ్యాపారి శనగ లోడ్‌ను అడ్డుకున్న రైతులు

కణేకల్లు: ఐపీ పెట్టి నట్టేట ముంచిన ఓ శనగ వ్యాపారి తన పొలంతో పాటు కౌలుకు చేసిన పొలంలోపండించిన శనగ పంటను మరో వ్యాపారికి విక్రయించేందుకు లారీలో తరలిస్తుండగా బాధిత రైతులు అడ్డుకున్నారు. ఈ ఘటన కణేకల్లు మండలం మాల్యం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు... మాల్యం గ్రామానికి చెందిన ఓ శనగల వ్యాపారి ఇటీవల రైతులకు డబ్బులివ్వకుండా మోసం చేసిన విషయం విదితమే. తనకు శనగలు విక్రయించిన రైతులందరికీ ఐపీ నోటీసులు పంపాడు. ఈ నేపథ్యంలో సదరు వ్యాపారి తన పొలంలో పండిన శనగ పంటను అనంతపురానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు సమాచారం. ఆ వ్యాపారి శుక్రవారం శనగ బస్తాలను లారీలో లోడు చేసుకుని తరలిస్తుండగా... విషయం తెలుసుకున్న బాధిత రైతులు వెంటనే లారీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారికి రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ ఈశ్వరరెడ్డి అక్కడకు చేరుకుని సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. ఐపీ పెట్టిన వ్యాపారి వచ్చి లెక్కలు తేల్చిన తర్వాతే లోడు తరలింపులకు అనుమతిస్తామంటూ భీష్మించారు. చివరకు సొల్లాపురంలోని గోదాములో శనగ బస్తాలను అన్‌లోడ్ చేయించడంతో రైతులు ఆందోళన విరమించారు.

యువకుడి ఆత్మహత్య

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామానికి చెందిన నరసింహులు (23) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... భూపసముద్రంలోని రమేష్, సుశీలమ్మ దంపతులకు కుమారుడు నరసింహులుతో పాటు ఓ కుమార్తె ఉంది. నరసింహులు స్నేహితులతో కలసి జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురువారం తీవ్ర స్థాయిలో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నరసింహులు తమ తోటలో ఉన్న పాడుబడిన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరికి వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.